
RNI No. APTEL/25/A3079



# మన బడి

## మాస పత్రిక



సంపుటి: 2 సంచిక: 2 జనవరి – 2026 పేజీలు: 24

समग्र शिक्षा
Samagra Shiksha
సమగ్ర శిక్ష



# ముచ్చటైన ముస్తాబు



* పేరు..మారిన తీరు.. * స్కిల్ ఫుల్ స్టూడెంట్స్ * బాల్య వివాహం వద్దు.. విద్యాభ్యాసం ముద్దు..

# పుస్తక మహోత్సవంలో మనబడి

విజయవాడలో జరిగిన 36వ పుస్తక ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్‌కు విశేష ఆదరణ లభించింది.

గ్యారెంటీడ్ ఎఫ్ఎల్ఎన్ మెటీరియల్, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర కిట్, నైతిక విలువల పుస్తకాలు, భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగ విద్యార్థులకు ఉపయోగించే టీఎల్ఎం, కేజీబీవీ విద్యార్థినులు తయారు చేసే ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, స్పోర్ట్స్ కిట్, పాల్ ల్యాబ్, అటల్ టింకరింగ్, స్టెమ్ ల్యాబ్స్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, TaRL, మెంటల్ హెల్త్ అండ్ కెరీర్ కౌన్సిలర్స్, ఒకేషనల్ మెటీరియల్, మనబడి మాస పత్రికలు ప్రదర్శించారు. మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు గారు, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం గారు, గనులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర గారు స్టాల్‌ను సందర్శించారు. విద్యాశాఖ పథకాలు, లక్ష్యాలు, ప్రగతి గురించి అడిగి తెలుసుకున్నారు.
















**గౌరవ సలహాదారులు**
**కోన శశిధర్,** ఐ.ఎ.ఎస్.,
సెక్రటరీ, పాఠశాల విద్యాశాఖ
**విజయరామరాజు.వి,** ఐ.ఎ.ఎస్.,
డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ
**పి.రంజిత్ బాషా,** ఐ.ఎ.ఎస్.,
డైరెక్టర్, ఇంటర్మీడియెట్ విద్య
**ఎడిటర్**
**బి.శ్రీనివాసరావు,** ఐ.ఎ.ఎస్.,
స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్ష
**సలహాసభ్యులు**
**వి.ఎన్.మస్తానయ్య,** డైరెక్టర్, SIEMAT
**ఎం.ఆర్.ప్రసన్నకుమార్,** ASPD –1
**డి.దేవానందరెడ్డి,** సెక్రటరీ, KGBV
**డి.మధుసూదనరావు,** డైరెక్టర్, AP Text Books Press
**కె.నాగేశ్వరరావు,** అడిషనల్ డైరెక్టర్, SAMO
**కె.రవీంద్రనాథ్ రెడ్డి,** ASPD –2
**వి.మనోహర్ నాయక్,** CMO
**కె.జీవనజ్యోతి,** సూపరింటెండెంట్
**వర్కింగ్ ఎడిటర్**
**చల్ల మధుసూదనరావు,** మీడియా కన్సల్టెంట్
**అసిస్టెంట్ ఎడిటర్**
**గణపతి రావు బెహరా,** PRO
**ఎడిటోరియల్ కమిటీ**
**డా. ఎస్.వి. లక్ష్మణరావు,** టీఎస్‌జీ (సీఎంవో)
**పైడి.వెంకట రమణ,** సీనియర్ ప్రోగ్రామర్
**డా. కె.శారద,** శామో ఫ్యాకల్టీ
**డా. వి.సతీష్ రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. ఎస్.ప్రసాద్ రావు,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**జి. మహేశ్వర రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. టి.ఇస్మాయిల్,** దీక్ష కో ఆర్డినేటర్
**డా. కె.పెంచలయ్య,** టీఎస్‌జీ (ఆర్టీఈ)
**డా. వై.నరసింహం,** టీఎస్‌జీ(ఐఈ)
**పి.వెంకటేశ్వరరావు,** టీఎస్‌జీ (ప్లానింగ్)
**పి.గీత,** టీఎస్‌జీ(ఓఎస్‌సీ)
**డిజైనింగ్**
**గిరిధర్ అరసవల్లి**
**చిత్రకారులు**
**మల్లిక్**


# మన బడి
## మాస పత్రిక



సంపుటి: 2 సంచిక: 2 జనవరి – 2026 పేజీలు: 24


## ముస్తాబు.. పిల్లలకు కొత్త సొబగు

మన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభా పాటవాలు దేశవ్యాప్తంగా మన్ననలు పొందుతున్నాయి. విద్య, విజ్ఞానం, ఆటపాటల్లో పిల్లలు రాణిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌ను ఒక యజ్ఞంలా చేపట్టింది. విప్లవాత్మకమైన సంస్కరణలు అమలు చేస్తోంది. సమాజ భాగస్వామ్యంతో బడులను బలోపేతం చేస్తోంది.

వెళ్లేందుకు బడి ఉంది. చదువు చెప్పేందుకు టీచర్లు ఉన్నారు. పుస్తకాలు, బ్యాగు, బెల్టు, షూ, డిక్షనరీలు ఇచ్చింది ప్రభుత్వం. ఆడేందుకు స్థలం, క్రీడా సామాగ్రి అందింది. రుచికరమైన, బలవర్ధకమైన మధ్యాహ్న భోజనం ఆకలి తీర్చి, ఆరోగ్యం అందిస్తోంది. నలతగా ఉండే వైద్యం, కలత చెందితే కౌన్సిలర్లు పిల్లలకు సాంత్వన చేకూరుస్తున్నారు.

సీఎం చంద్రబాబు గారి ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా ముస్తాబు కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా బడుల్లో కొత్తగా ప్రారంభం అయింది. "శుభ్రతే ఆరోగ్యం – ఆరోగ్యమే ఆయుష్షు" అనే నినాదంతో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఆలోచన ఈ కార్యక్రమానికి నాంది పలికింది.

పిల్లలకు నిత్యం వ్యక్తిగత పరిశుభ్రతను అలవాటు చేయడం, పిల్లలు రోజూ పాఠశాలకు వచ్చేలా చూడడం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాల పెంపు పాఠశాలలు, వసతిగృహాల్లో పిల్లలకు సురక్షితమైన పరిశుభ్ర వాతావరణం కల్పించడం ముస్తాబు లక్ష్యాలు. ముస్తాబుతో పిల్లలు అందంగా, ఆనందంగా, ఆత్మ విశ్వాసంతో భావితరం నాయకులుగా ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

– **బి శ్రీనివాసరావు,** IAS
ఎడిటర్ & రాష్ట్ర పథక సంచాలకులు
సమగ్ర శిక్ష, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
For mail: manabadimagazine@gmail.com, manabadimagazine@apschooledu.in,
Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed at **M/s. Lakshmi Vignesh Printers,** Guntur
ఆన్ లైన్ మ్యాగజైన్ కోసం: https://schooledu.ap.gov.in/samagrashiksha/ మరియు cse.ap.gov.in

# స్కిల్ ఫుల్ స్టూడెంట్స్

★ ఘనంగా 'రాష్ట్ర స్థాయి స్కిల్ కాంపిటేషన్స్ 2025-26'

★ 26 జిల్లాల నుండి 10 ట్రేడ్లలో 260 ప్రాజెక్టులు ప్రదర్శన

★ ర్యాంప్ వాక్ తో అదరగొట్టిన విద్యార్థినులు




విజయవాడలోని మురళి రిసార్టులో 'రాష్ట్ర స్థాయి స్కిల్ కాంపిటేషన్స్ 2025-26' కార్యక్రమం ఘనంగా జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల నుండి 10 ట్రేడుల్లో 260 ప్రాజెక్టులు ప్రదర్శించారు. కేంద్ర ప్రభుత్వం అములు చేస్తున్న జాతీయ విద్యా విధానం(NEP) 2020 స్ఫూర్తితో, ఒకేషనల్ ఎడ్యుకేషన్‌ను ఒక అదనపు సబ్జెక్టుగా కాకుండా, విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదిగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాక్టికల్ నాలెడ్జ్ కు ప్రాధాన్యతనిస్తూ, విద్యాభ్యాసం నుంచే నైపుణ్యాలను పాఠశాలల్లో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇస్తున్నారు. పాఠాలు చదివి బట్టీపట్టి పద్ధతిని వీడి, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌ను ప్రోత్సహిస్తున్నారు.








వచ్చే విద్యా సంవత్సరం నుండి పదో తరగతి (SSC) మార్కుల జాబితాలో ఒకేషనల్ సబ్జెక్టు మార్కులను కూడా చేర్చనున్నామని ఈ కార్యమానికి ముఖ్య అతిథిగా వచ్చిన సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ప్రకటించారు. ఇది విద్యార్థుల గ్రేడింగ్‌లో కీలక పాత్ర పోషించనుందన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ హైస్కూళ్లలో ఒకేషనల్ ఎడ్యుకేషన్‌ను ప్రవేశపెట్టేందుకు బడ్జెట్ ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేస్తుందన్నారు.



**ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష అమలు చేస్తున్న 11 ఒకేషనల్ ట్రేడ్లు ఇవే**

1. వ్యవసాయం (Agriculture)
2. వస్త్ర పరిశ్రమ / అపారెల్ (Apparel)
3. ఆటోమొబైల్ రంగం (Automotive)
4. బ్యూటీ & వెల్ నెస్ (Beauty & well-ness)
5. బ్యాంకింగ్, ఆర్థిక సేవలు & బీమా (BFSI)
6. ఎలక్ట్రానిక్స్ (Electronics)
7. ఫుడ్ ప్రాసెసింగ్ (Food Processing)
8. ఆరోగ్య సంరక్షణ (Healthcare)
9. ఐటీ / ఐటీఈఎస్ (IT / ITeS)
10. రిటైల్ (Retail)
11. విద్యుత్ శక్తి రంగం (Power)

ప్రాజెక్టులో గెలుపొందిన విజేతలకు ట్రేడుల వారీగా ప్రథమ బహుమతి రూ. 25వేలు, ద్వితీయ బహుమతి రూ. 15 వేలు, తృతీయ బహుమతి రూ. 10 వేలు చొప్పున నగదు బహుమతితో పాటు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.












## ర్యాంప్ వాక్... అదరహో

వృత్తి విద్యా కోర్సుల్లో భాగంగా 'అపారెల్, మేడ్-అప్స్ అండ్ హోమ్ ఫర్నిషింగ్ కోర్సుల్లో భాగంగా వస్త్ర తయారీ, కుట్టు శిక్షణ, గృహ అలంకరణ సామగ్రి అంశాల్లో శిక్షణ పొందిన విద్యార్థులు తామే స్వయంగా కుట్టుకున్న వస్త్రాలు ధరించి ర్యాంప్ వాక్ చేసి, అందరినీ ఆకట్టుకున్నారు.

ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎస్పీడీలు డా. ఎం.ఆర్.ప్రసన్నకుమార్, కె.రవీంద్రనాథ్ రెడ్డి, సీమ్యాట్ డైరెక్టర్ వి.ఎన్.మస్తానయ్య, ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు డా. కె.వి.శ్రీనివాసులురెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కంట్రోలర్ రాజగోపాల్, కృష్ణా జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు, ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ , కృష్ణా జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ కుముదిని, స్టేట్ జీసీడీవో శ్రీ వివిఎస్ఎన్ మూర్తి, జిల్లా జీసీడీవోలు, ఒకేషనల్ కోఆర్డినేటర్లు, ట్రైనర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేరు..మారిన తీరు..

★ వలసవాదానికి గుర్తుగా ఉన్న పేర్ల మార్పు

★ పేర్లలోనూ ప్రజాస్వామ్యం, స్వదేశీ భావన

భారతదేశంలో వలసవాదపు అవశేషాలను తొలగించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఢిల్లీలోని సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న కొత్త ప్రధానమంత్రి కార్యాలయం (PMO) సముదాయానికి 'సేవా తీర్థ్' అని నామకరణం చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో గవర్నర్ల రాజ్ భవన్లకు లోక్ భవన్‌గా పేరు మారుస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం సౌత్ బ్లాక్‌లో ఉన్న పీఎంఓ కార్యాలయాన్ని కొత్త ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్-1కి తరలించనున్నారు. ఈ సముదాయం 'సేవా తీర్థ్-1', 'సేవా తీర్థ్-2', 'సేవా తీర్థ్-3' అనే మూడు భవనాలను కలిగి ఉంటుంది. 'సేవా తీర్థ్-1'లో కొత్త పీఎంఓ, 'సేవా తీర్థ్-2'లో కేబినెట్ సెక్రటేరియట్, 'సేవా తీర్థ్-3'లో జాతీయ భద్రతా మండలి (NSA) కార్యాలయాలు ఉంటాయి. సౌత్ బ్లాక్ నుంచి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పీఎంఓ కార్యాలయం తరలిపోవడం చరిత్రలో ఇదే మొదటిసారి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు 'సేవా' (సేవ) స్ఫూర్తిని ఈ మారిన కొత్త పేర్లు ప్రతిబింబిస్తాయి.

### ప్రధాని నివాసానికి దగ్గరగా

'సేవా తీర్థ్' ప్రస్తుతం ఉన్న వాయు భవన్ పక్కనే ఉంది. ఇది ప్రధాని నివాసం 5-7 లోక్ కళ్యాణ్ మార్గ్ కంటే, కొత్తగా నిర్మించనున్న ప్రధాని నివాసానికి చాలా దగ్గరగా ఉంటుంది. పీఎంఓ ఇతర అత్యున్నత కార్యాలయాలను ఒకే చోట కేంద్రీకరించడం ద్వారా పాలనా సామర్థ్యాన్ని మెరుగుపరచడం ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. ప్రధానమంత్రి మోదీ 2014లో బాధ్యతలు చేపట్టినప్పుడు, పీఎంఓ ప్రజల సేవ (Public Service) కోసం ఉండాలని చెప్పిన స్ఫూర్తిని ఈ 'సేవా తీర్థ్' అనే పేరు సూచిస్తుంది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## ఈ మార్పులు ఎందుకంటే..

'రాజ్' అనే పదం బ్రిటిష్ కాలం నుండి కొనసాగిన వలసవాదపు ప్రతీక. రాజులు, పాలకులు, అధికార కేంద్రీకరణ వంటి భావాలను ఈ పదం సూచిస్తుంది. కానీ స్వతంత్ర భారతదేశం ప్రజాస్వామ్య వ్యవస్థపై నడుస్తోంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అభిప్రాయం ప్రకారం, ప్రజాస్వామ్యంలో 'రాజ్' అనే పదాన్ని కొనసాగించడం సరికాదు. అందుకే ఈ పేర్లను మార్చి, ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా 'లోక్ భవన్' అనే పేరును పెట్టారు. 'లోక్' అంటే ప్రజలు, 'భవన్' అంటే నివాసం. ఇప్పటి వరకు ప్రజల్లో 'రాజ్ భవన్' అంటే గవర్నర్ నివాసం అని ఒకే అర్థం ఉండేది. కానీ ఇప్పుడు లోక్ భవన్ అనే పేరు ప్రజలకు మరింత దగ్గరగా, సులభంగా అర్థమయ్యేలా ఉంది.

## గతంలో జరిగిన మార్పులు

కేంద్ర ప్రభుత్వం వలసవాద చిహ్నాలను తొలగించడంలో ఇప్పటికే పలు నిర్ణయాలు తీసుకుంది. ఇవి దేశంలో ప్రతిష్ఠాత్మకమైన సంస్కరణలు:

**1. రాజ్ పథ్ → కర్తవ్య పథ్**

ఢిల్లీ రాజ్‌పథ్ లో జరిగే రిపబ్లిక్ డే పరేడ్ దశాబ్దాలుగా ప్రజలకు తెలుసు. కానీ అది వలసవాద కాలం స్మారకంగా నిలిచిపోయింది. అందుకే కర్తవ్య పథ్ అనే పేరు పెట్టారు.




**2. 'ఇండియా' బదులు 'భారత్' ప్రయోగం**

సర్కారు అధికారిక పత్రాలు, సమావేశాలు, అంతర్జాతీయ కార్యక్రమాల్లో కూడా ఇండియా బదులు 'భారత్' అనే పేరు ప్రాధాన్యం పొందుతోంది.

**3. బీటింగ్ రిట్రీట్‌లో ఇంగ్లీష్ ప్రార్థనా గీతాల తొలగింపు**

పాత పాలనా పద్ధతులను గుర్తు చేసే సంగీతాలను తీసేసి, భారతీయ సంగీతానికి ప్రాధాన్యం ఇచ్చింది.

**4. ప్రభుత్వ వెబ్‌సైట్లలో హిందీ ప్రాధాన్యం**

ప్రభుత్వ వెబ్‌సైట్లు మొదట హిందీలో కనిపించేలా, తర్వాతే ఇంగ్లీష్‌కు మారేలా మార్పు.

5. రిపబ్లిక్ డే బీటింగ్ రిట్రీట్ కార్యక్రమలో భాగంగా వినిపించే 'అబైడ్ విత్ మి' గీతం స్థానంలో కవి ప్రదీప్ రాసిన దేశభక్తి గీతం 'ఆయే మేరే వతన్‌కే లోగో'ను చేర్చారు.

## మరికొన్ని పేరు మార్పులు

వీటితో పాటు స్వాతంత్ర్యోద్యమనికి గుర్తుగా భారతదేశంలో అనేక విమానాశ్రయాలకు స్వాతంత్ర్య సమరయోధులు, ప్రముఖ జాతీయ నాయకుల పేర్లు పెట్టారు.

1. **షహీద్ భగత్ సింగ్ అంతర్జాతీయ విమానాశ్రయం (చండీగఢ్)** – విప్లవ స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ ను గౌరవిస్తూ ఆయన పేరును పెట్టారు.

2. **వీర్ సావర్కర్ అంతర్జాతీయ విమానాశ్రయం (పోర్ట్ బ్లెయిర్)** – స్వాతంత్ర్య

సమరయోధుడు వినాయక్ దామోదర్ సావర్కర్‌ను గౌరవిస్తూ నామకరణం చేశారు.

3. **బిజు పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం (భువనేశ్వర్)** – స్వాతంత్ర్య సమరయోధుడు, విమాన పైలట్, ఒడిశా మాజీ ముఖ్యమంత్రి బిజు పట్నాయక్ పేరును పెట్టారు.

4. **లోకప్రియ గోపీనాథ్ బోర్డొలోయి అంతర్జాతీయ విమానాశ్రయం (గువాహటి)** – స్వాతంత్ర్య సమరయోధుడు, అస్సాం తొలి ముఖ్యమంత్రి గోపీనాథ్ బోర్డొలోయిని స్మరించేందుకు ఈ పేరును పెట్టారు.

5. **బిర్సా ముండా విమానాశ్రయం (రాంచి)** – గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజావీరుడు బిర్సా ముండా పేరుతో ఈ విమానాశ్రయానికి నామకరణం చేశారు.

6. **సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం (అహ్మదాబాద్)** – స్వాతంత్ర్య సమరయోధుడు భారతదేశ తొలి ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ను గౌరవిస్తూ నామకరణం చేశారు.

7. **లాల్ బహదూర్ శాస్త్రి విమానాశ్రయం (వారణాసి)** – భారతదేశ రెండవ ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు లాల్ బహదూర్ శాస్త్రి పేరును పెట్టారు.

8. **లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ్ విమానాశ్రయం (పట్నా)** – సామ్యవాద నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు జయప్రకాశ్ నారాయణ్ స్మరించేందుకు నామకరణం చేశారు.

9. **డా. బాబాసాహెబ్ అంబేద్కర్ అంతర్జాతీయ విమానాశ్రయం (నాగ్‌పూర్)** – భారత రాజ్యాంగ నిర్మాత, డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్, సామాజిక సంస్కర్త డా. బి.ఆర్. అంబేద్కర్ పేరును పెట్టారు.

సాంస్కృతిక, చారిత్రక ప్రాముఖ్యతలను పునరుద్ధరించడానికి ఈ క్రింది ప్రదేశాలు, ప్రాంతాల పేర్లు మార్చారు.

**పాత పేరు – కొత్త పేరు**

1. అలహాబాద్ – **ప్రయాగ్‌రాజ్** (ఉత్తరప్రదేశ్)
2. ఫైజాబాద్ జిల్లా – **అయోధ్య జిల్లా** (ఉత్తరప్రదేశ్)
3. రాజమండ్రి – **రాజమహేంద్రవరం** (ఆంధ్రప్రదేశ్)
4. గుర్గావ్ – **గురుగ్రామ్** (హర్యానా)
5. ఔరంగాబాద్ – **ఛత్రపతి సంభాజీనగర్** (మహారాష్ట్ర)
6. ఒస్మానాబాద్ – **ధారాశివ్** (మహారాష్ట్ర)
7. హోషంగాబాద్ – **నర్మదాపురం** (మధ్యప్రదేశ్)
8. పోర్ట్ బ్లెయిర్ – **శ్రీ విజయపురం** (అండమాన్ & నికోబార్)

– **వి. విష్ణు**, ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్, ఎంపీపీఎస్, సంతపురిటి

















# న్యూస్ రౌండప్


## అంతర్జాతీయం



**పర్సన్ ఆఫ్ ద ఇయర్ ను ప్రకటించిన టైమ్ మ్యాగజీన్:** ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజీన్ టైమ్ ఈ ఏడాదికిగానూ 'పర్సన్ ఆఫ్ ద ఇయర్'గా 'ఆర్కిటెక్ట్స్ ఆఫ్ ఏఐ'ని (ఏఐ సృష్టికర్తలు) ప్రకటించింది. 2025ను ఏఐ ఏడాదిగా అభివర్ణించిన ఈ మ్యాగజీన్ దాని శక్తి ప్రపంచానికి స్పష్టంగా కనిపించిందని పేర్కొంది. ఏఐ మన జీవితాలను మార్చడంలో, ఆశ్చర్యపరచడంలో, ఆందోళన కలిగించడంలో ప్రధాన పాత్ర పోషించిందని వివరించింది. ఏఐ రూపకల్పనలో శ్రమించిన వారందరూ సమష్టిగా ఈ పురస్కారానికి అర్హులని ప్రకటించింది.

రష్యా ఉపగ్రహ ప్రయోగం: రష్యా డిసెంబరు 28న సోయజ్-2.1బి అనే వాహక నౌక ద్వారా ఒకేసారి 52 ఉపగ్రహాలను నింగిలోకి పంపింది. వోస్టోక్నీ స్పేస్ పోర్టు నుంచి ఈ ప్రయోగం చేపట్టింది. కక్ష్యలో ప్రవేశపెట్టిన వాటిలో ఇరాన్ కు చెందిన మూడు కమ్యూనికేషన్ ఉపగ్రహాలు కూడా ఉన్నాయి. వాటిలో ఒకటైన 'పాయా' బరువు 150 కిలోలు. ఇరాన్ ఇప్పటివరకూ కక్ష్యలోకి పంపించిన అత్యంత బరువైన ఉపగ్రహం ఇదే.

**అత్యంత పొడవైన ఎక్స్ ప్రెస్ వే సొరంగాన్ని ప్రారంభించిన చైనా:** ప్రపంచంలోకెల్లా అత్యంత పొడవైన ఎక్స్ ప్రెస్ వే సొరంగాన్ని చైనా డిసెంబరు 26 ప్రారంభించింది. 'తియాన్షన్ షెంగ్లీ'గా దానికి నామకరణం చేశారు. ఈ సొరంగం పొడవు 22.13 కిలోమీటర్లు. వాయవ్య చైనాలోని షింజియాంగ్ యూగర్ అటానమస్ రీజియన్లో సెంట్రల్ తియాన్షన్ పర్వతాల గుండా ఇది వెళ్తుంది.



**ఐక్యరాజ్యసమితి శరణార్థి సంస్థ అధిపతి:** ఇరాక్ మాజీ అధ్యక్షుడు బర్హమ్ సలీహ్ ను ఐక్యరాజ్యసమితి శరణార్థి సంస్థ తరువాతి అధిపతిగా సమితి జనరల్ అసెంబ్లీ ఆమోదించింది. 1970ల తరువాత పశ్చిమాసియాకు చెందిన వ్యక్తి మొదటిసారి ఈ పదవికి ఎంపికయ్యారు. 193 మంది సభ్యులున్న సర్వ ప్రతినిధి సభ 65 ఏళ్ల వయసు గల కుర్దిష్ రాజకీయ నాయకుడైన బర్హమ్ సలీహ్ ను ఐరాస శరణార్థుల హైకమిషనర్ గా ఏకాభిప్రాయంతో ఎన్నుకుంది.

ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్, సలీహ్ ను ఈ పదవికి సిఫార్సు చేశారు.



## జాతీయం



**సంథాలీ భాషలో భారత రాజ్యాంగం:** దేశరాజధాని దిల్లీలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము డిసెంబరు 25న సంథాలీ భాషలో భారత రాజ్యాంగాన్ని ఆవిష్కరించారు. దేశంలో మనుగడలో ఉన్న అత్యంత ప్రాచీన భాషల్లో ఒకటైన సంథాలీని 2003లో 92వ రాజ్యాంగ సవరణ ద్వారా ఎనిమిదో షెడ్యూల్లో చేర్చారు. ఝార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, బిహార్ రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో గిరిజనులు ఈ భాషను మాట్లాడతారు. సంథాలీ భాషలో రాజ్యాంగాన్ని తీసుకొచ్చేందుకు కృషి చేసిన కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ బృందాన్ని రాష్ట్రపతి అభినందించారు.

**వికసిత భారత్– గ్యారంటీ ఫర్ రోజ్గర్ అండ్ ఆజీవికా మిషన్:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో భారత ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వికసిత భారత్–గ్యారంటీ ఫర్ రోజ్గర్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) (వీబీ–జీ రాం జీ) బిల్లు చట్టంగా మారింది. పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొందిన ఈ బిల్లుకు డిసెంబరు 21 న రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. దీనిద్వారా ప్రతి ఏటా గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు 125 పని దినాలకు హామీ లభిస్తుంది. వ్యవసాయ పనులకు కూలీల కొరత ఎదురుకాకుండా చూడటానికి విత్తనాలు, నూర్పిళ్లు ఎక్కువగా ఉండే 60 రోజులపాటు ఈ పథకాన్ని నిలిపేస్తారు. దీనికింద చేపట్టే పనుల ప్రణాళిక, పర్యవేక్షణ అంతా గ్రామ పంచాయతీల ద్వారానే జరుగుతుంది.



**వందేభారత్ స్లీపర్ రైలు ప్రయోగపరీక్ష విజయవంతం:** దేశీయంగా రూపొందించిన వందేభారత్ స్లీపర్ రైలు గంటకు 180 కి.మీ. గరిష్ఠ వేగాన్ని సాధించగలిగింది. రైల్వే భద్రత కమిషనర్ (సీఆర్ఎస్) సమక్షంలో దీనికి సంబంధించిన తుది పరీక్షలను నిర్వహించారు. కోటా (రాజస్థాన్) నుంచి నాగ్దా (మధ్యప్రదేశ్) మధ్య ఈ వేగాన్ని చేరుకోవడం ద్వారా మరో మైలురాయిని అధిగమించినట్లయిందని రైల్వే మంత్రిత్వశాఖ పేర్కొంది. గాజుగ్లాసుల్లో నీళ్లు నింపి ఒకదానిపై ఒకటిగా ఈ రైలింజిన్లో ఉంచినా.. గరిష్ఠ వేగాన్ని చేరుకున్నప్పుడు కూడా ఏమాత్రం తొణక్కపోవడాన్ని వీడియో తీశారు. ఈ వీడియోని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. రైలు గమనంలో స్థిరత్వం, కుదుపులు, ప్రకంపనలు, బ్రేకుల పనితీరు, భద్రత ప్రమాణాలు వంటివన్నీ పరీక్షించారు. రైల్లో ఆకర్షణీయమైన (ఏసీ) స్లీపర్ బెర్తులు, అధునాతన సస్పెన్షన్ వ్యవస్థ, ఆధునిక మరుగుదొడ్లు, నిప్పును గుర్తించే వ్యవస్థలు, సీసీటీవీ నిఘా వంటివి ఉంటాయి.




**WSF స్క్వాష్ వరల్డ్ కప్ ను తొలిసారిగా గెలుచుకున్న భారత్:** స్క్వాష్ వరల్డ్ లో భారత్ చరిత్ర సృష్టించింది. డిసెంబర్ 14 న చెన్నైలో జరిగిన ఫైనల్లో భారత్ 3–0తో హాంకాంగ్‌ను చిత్తు చేసింది. తద్వారా ప్రతిష్ఠాత్మక టైటిల్ అందుకున్న తొలి ఆసియా దేశంగా రికార్డు నెలకొల్పింది. 2023లో సాధించిన కాంస్యమే ఈ టోర్నీ చరిత్రలో మనోళ్ల అత్యుత్తమ ప్రదర్శన. ఈసారి టోర్నమెంట్‌లో రెండో సీడ్‌గా బరిలోకి దిగిన భారత్ ఒక్క మ్యాచ్ కూడా చేజార్చుకోకుండా విజేతగా నిలవడం విశేషం. భారత స్క్వాష్‌స్టార్ జోష్నా చిన్నప్ప, వరల్డ్ 37వ ర్యాంకర్ లీ కా యాని 3–1 తేడాతో ఓడించి, భారత్‌కి శుభారంభం అందించింది. ఆ తర్వాత భారత స్క్వాష్ ప్లేయర్ అభయ్ సింగ్, తన ప్రత్యర్థి అలెక్స్ లే ని 3–0 తేడాతో ఓడించాడు. చివరి మ్యాచ్‌లో 17 ఏళ్ల భారత స్క్వాష్ ప్లేయర్ అనాహత్ సింగ్, టొమాటో హో ని 3–0 తేడాతో చిత్తు చేశాడు. గ్రూపు దశలో స్విట్జర్లాండ్, బ్రెజిల్‌లను ఓడించిన మనోళ్లు.. క్వార్టర్స్ లో దక్షిణాఫ్రికాపై, సెమీస్‌లో రెండుసార్లు ఛాంపియన్ ఈజిప్టుపై విజయం సాధించారు. ఇంతకుముందు ఈజిప్ట్ రెండు సార్లు ఈ స్క్వాష్ వరల్డ్ కప్ టైటిల్స్ గెలవగా ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా చెరోసారి విజయం అందుకున్నాయి.



# సైన్స్ అండ్ టెక్నాలజీ

**ఇస్రో సరికొత్త రికార్డు – LVM3-M6 బాహుబలి రాకెట్ ప్రయోగం:** ఇస్రో తన ప్రస్థానంలో మరో మైలు రాయిని దాటింది. తాజాగా LVM3-M6 బాహుబలి రాకెట్ ప్రయోగంతో సరికొత్త రికార్డును నెలకొల్పింది. అమెరికా భారత్ సంయుక్తంగా చేపట్టిన ప్రయోగాన్ని ఇస్రో విజయవంతం చేసింది. దేశ చరిత్రలో తొలిసారిగా 6,100 కిలోల బరువైన బ్లూబర్డ్ బ్లాక్-2 ఉపగ్రహాన్ని ఇస్రో నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్-షార్ నుంచి డిసెంబరు 24న ఉదయం 8.55 గంటలకు ఉపగ్రహాన్ని తీసుకుని అత్యంత శక్తిమంతమైన బాహుబలి రాకెట్ ఎల్వీఎం3-ఎం6 నింగిలోకి దూసుకెళ్లింది. 15.33 నిమిషాల తర్వాత రాకెట్ నుంచి విడిపోయిన బ్లూబర్డ్ నిర్దేశిత కక్ష్యలోకి చేరింది. దేశ తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర 'గగన్ యాన్'లో ఎల్వీఎం3 రాకెట్ నే ఉపయోగిస్తారు.






**బ్రహ్మోస్ క్షిపణి విజయవంతం:** దీర్ఘశ్రేణి సూపర్ సోనిక్ క్రూజ్ క్షిపణి బ్రహ్మోస్ ను భారత సైన్యం 2025, డిసెంబరు 1న విజయవంతంగా పరీక్షించింది. బంగాళాఖాతం వెంట ఒక ప్రయోగవేదిక నుంచి ఈ అస్త్రం దూసుకెళ్లింది. సైన్యంలోని దక్షిణ విభాగానికి చెందిన బ్రహ్మోస్ యూనిట్ దీన్ని చేపట్టింది. అండమాన్, నికోబార్లోని త్రివిధ దళాల విభాగం సమన్వయంతో ఇది సాగింది. ఈ పరీక్షలో క్షిపణి నిర్దేశిత లక్ష్యాన్ని అత్యంత కచ్చితత్వంతో ఛేదించింది. భారత్, రష్యాలు ఉమ్మడిగా రూపొందించిన బ్రహ్మోస్ క్షిపణిలో అధునాతన దిక్సూచి, నియంత్రణ వ్యవస్థలు ఉన్నాయి.




**తొలి స్వదేశీ హైడ్రోజన్ వాణిజ్య నౌక:** అంతర్గత జల రవాణాలో మన దేశం కీలక ముందడుగు వేసింది. హైడ్రోజన్ తో నడిచే తొలి స్వదేశీ పడవను డిసెంబరు 11న గంగానది జలాలపై ఆవిష్కరించింది. 'హరిత నౌక కార్యక్రమం కింద దేశీయంగా కొచ్చిన్ షిప్ యార్డు లిమిటెడ్లో దీనిని నిర్మించారు. ఈ నౌక పొడవు 24 మీటర్లు. ఏసీ క్యాబిన్ ఉంటుంది. దీనిలో 50 మంది ప్రయాణించవచ్చు. ఎలక్ట్రో మెకానికల్ పద్ధతిలో ఇది విద్యుదుత్పత్తి చేసుకుంటుంది. ఇంధనం వాడాక కేవలం నీరు, వేడిమి బయటకు వెలువడతాయి. కాలుష్య ఉద్గారాలు అసలు ఉండవు. ఎలాంటి శబ్దం/మోత చేయకపోవడం దీని ప్రత్యేకతల్లో ఒకటి. హైడ్రోజన్ శక్తితో పడవలు, ఓడలు నడుపుతున్న చైనా, నార్వే, నెదర్లాండ్, జపాన్ దేశాల సరసన భారత్ నిలిచింది.



**తీర రక్షణ దళంలోకి నౌక 'అమూల్య':** మెరుపు వేగంతో సాగరజలాల్లో గస్తీ నిర్వహించే నౌక అమూల్య డిసెంబరు 19న భారత తీర రక్షణ దళంలో చేరింది. నిఘా, గాలింపు, సహాయ చర్యలు, స్మగ్లింగ్ నివారణ, కాలుష్య ప్రతిస్పందన వంటి కార్యకలాపాలను ఇది చేపట్టగలదు. ఈ నౌక పొడవు 51 మీటర్లు. ఇందులో 3వేల కిలోవాట్ల సామర్థ్యమున్న రెండు అధునాతన డీజిల్ ఇంజిన్లు ఉన్నాయి. ఈ నౌక గరిష్ఠంగా 50 కిలో మీటర్ల వేగాన్ని అందుకోగలదు. ఏకబిగిన 1500 నాటికల్ మైళ్ల దూరం ప్రయాణించగలదు. దీన్ని గోవా షిప్ యార్డ్ నిర్మించింది. అమూల్యలో 60 శాతం స్వదేశీ ఉపకరణాలను ఉపయోగించారు. ఒడిశాలోని పారదీప్ కేంద్రంగా ఈ నౌక సేవలు అందిస్తుంది.

– **డా. ఎస్.వి. లక్ష్మణరావు,** కన్సల్టెంట్, కమ్యూనిటీ మొబిలైజేషన్ విభాగం



# 'కోనసీమ కోడింగ్ కిడ్'

## సాఫ్ట్ వేర్ సిద్ధార్థ్

### "Age is Just a Number "

12 ఏళ్లకే సాఫ్ట్ వేర్ డెవలపర్ అయ్యాడు ఈ కుర్రాడు. వినడానికే ఆశ్చర్యంగా ఉంది కదూ.. పైథాన్, 3 JS కోడింగ్, 3 డి యానిమేషన్స్ ఉపయోగించి వెబ్ సైట్లు డిజైన్ చేశాడు, సంపాదించిన డబ్బులతో తన తోటి విద్యార్థులు, స్నేహితుల కోసం Firebase storage కొనుగోలు చేసి పాఠాలను, నోట్సును అందులో స్టోర్ చేసాడు. అంతేకాదు, తండ్రితో కలిసి మన-కిరాణా అనే వెబ్ సైట్ ను తయారు చేసి, ఈ కామర్స్ రంగంలో దూసుకుపోతున్నాడు. ఒకవైపు సాఫ్ట్ వేర్ రంగంలో కొత్త ఆవిష్కరణలు చేస్తూ, ఆటపాటల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు. అండర్ 13 స్టేట్ లెవల్ బ్యాడ్మింటన్ కాంపిటీషన్, అండర్ 14 ఇంటర్ డిస్ట్రిక్ట్ లెవల్ కాంపిటీషన్ల లో తన ప్రతిభను చాటాడు. శాస్త్రీయ సంగీతాన్ని నేర్చుకుంటున్నాడు గుత్తుల సిద్ధార్థ్...

### కోనసీమ టు కోడింగ్ కిడ్....

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, గొల్లవిల్లి లో 11 సెప్టెంబరు 2013 లో గుత్తుల సిద్ధార్థ్ జన్మించాడు. తల్లి ప్రశాంతి లక్ష్మి స్వరూప, తండ్రి వెంకటేశ్..ఇద్దరూ సాఫ్ట్ వేర్ ఇంజనీర్లే.. కేజీ నుండి 5వ తరగతి వరకు ప్రైవేట్ పాఠశాల లో చదివిన సిద్ధార్థ్, 6వ తరగతి లో గొల్లవిల్లి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల (పీఎం శ్రీ)లో చేరాడు, ప్రస్తుతం అదే పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు.. తల్లిదండ్రులు ఇద్దరూ సాఫ్ట్ వేర్ ప్రొఫెషనల్స్ కావడంవతో ఆ ప్రభావం సిద్ధార్థ్ మీద చూపించింది, తండ్రి సహాయంతో కోడింగ్ నేర్చుకోవడం మొదలు పెట్టాడు, సొంతంగా వెబ్ సైట్లు డిజైన్ చేయడం మొదలు పెట్టాడు. తన ఆలోచనలు విభిన్నంగా ఉన్నా, ప్రత్యేకంగా ఉంటాయి. అందుకే తను Three. js, WebGL, Blender వంటి క్లిష్టమైన టెక్నాలజీలను ఎంచుకున్నాడు. బ్రూనో సైమన్ వంటి గ్లోబల్ మాస్టర్స్ దగ్గర నేర్చుకుంటూ కోర్సులు నేర్చుకుంటూ, మ్యాట్రిక్స్ సినిమాల్లో కనిపించే 3D డిజైన్లను తయారుచేస్తున్నాడు.


### సంపాదన కాదు.. సమాజం ముఖ్యం


సిద్ధార్థ్ గొప్పతనం కోడింగ్‌లోనే లేదు, తన సంపాదనను వినియోగించిన తీరులో ఉంది. 'SG Tensiles' అనే ఈ కామర్స్ వ్యాపారానికి వెబ్ సైట్ తయారు చేసి ఆ ప్రాజెక్ట్ ద్వారా వచ్చిన మొదటి పది వేల రూపాయలను తన పాఠశాల (ZPPHS, గొల్లవిల్లి) విద్యార్థులకు పాఠాలు నోట్స్ రూపంలో అందిస్తే బాగుంటుంది అని, ఆ డబ్బుతో Firebase storage కొనుగోలు చేశాడు. అందుకోసం ఒక వెబ్‌సైట్‌ను రూపొందించి, అందులో ఉచితంగా నోట్స్ అందుబాటులో ఉంచాడు.

### ఏఐ వాయిస్ అసిస్టెంట్ ని తయారు చేస్తున్నాను

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతోంది. ఉపాధ్యాయులు చాలా బాగా ప్రోత్సహిస్తున్నారు. తాను ఒక ఏఐ సాఫ్ట్ వేర్ ను రెడీ చేసే పనిలో ఉన్నాడు సిద్ధార్థ్. పైథాన్ (Python) ను ఉపయోగించి ఒక సొంత వాయిస్ అసిస్టెంట్‌ను తయారు చేస్తున్నాడు. ఇది సాధారణ అసిస్టెంట్‌లా కాకుండా, మనిషికి ఒక 'కో-పైలట్' లాగా సహాయపడుతుందని సిద్ధార్థ్ చెబుతున్నాడు.


– అమలాపురపు దుర్గా ప్రసాద్,
జర్నలిస్టు








# బాల్య వివాహాలు వద్దు.. విద్యాభ్యాసమే ముద్దు..




బాల్యవివాహాలు పెనుభూతంలా పెరిగి పోతున్నాయి... అక్షరాస్యత లేక, అవగాహన లేక, ఆర్థిక స్తోమత, ఇలాంటి ఎన్నో కారణాలు బాల్య వివాహాలకు కారణం కావొచ్చు కానీ, అలా చేయడం వల్ల తరాలు నాశనమైపోతున్నాయి, ఆడవారికైనా, మగవారికైనా పెళ్లీడు ఉంటుంది, అది పాటిస్తే అందరికీ మంచిది. చదువుకునే వయస్సులో బాలికలకు పెళ్లిచేసి చేయికడిగేసుకునే రోజులు కావు ఇవి. లింగ సమానత్వాన్ని పాటించి అందరూ సమానమే అని భావించి, బాలికా విద్యను ప్రోత్సహించాలి, అందుకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలతో గ్రామీణ స్థాయి నుండి క్షేత్రస్థాయి వరకు అవగాహన కల్పిస్తున్నాయి. బాల్య వివాహం నిరోధక చట్టం ప్రకారం 18 సంవత్సరాల వయసు నిండని అమ్మాయికి 21 సంవత్సరాలు నిండని అబ్బాయికి వివాహం చేయకూడదు, అలా చేస్తే అది చట్టరీత్యా నేరం. 2023 UNICEF నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 64 కోట్ల బాల్య వివాహాలు 2023లో చోటుచేసుకున్నాయి. అందులో మూడవ వంతు భారతదేశంలో జరగడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ నివేదికను UNICEF ప్రస్తావించింది. జాతీయ నేర గణాంకాల శాఖ నివేదిక ప్రకారం బాల్య వివాహ కేసులు 2023లో ఆరింతలు వరకు పెరిగాయి అని 2022 సంవత్సరంతో పోల్చుకుంటే తెలుస్తుంది.



## బాల్యవివాహాలకు కారణాలు

### 1. పేదరికం.

పేదరికం కుటుంబంపై ఒత్తిడిని తెస్తుంది. కూడు, గూడు, గుడ్డ వంటి ప్రాథమిక అవసరాలను తీర్చడమే కష్టంగా ఉన్నప్పుడు ఇంట్లో ఉన్న బాలిక రజస్వల అవ్వగానే వివాహం చేసి పంపించేద్దాం అని అనుకుంటారు.. అలా చేస్తే కుటుంబంపై ఆధారపడి ఉన్న వ్యక్తుల సంఖ్య తగ్గుతుందని భావిస్తూ బాల్యంలోనే వివాహాలు చేస్తున్నారు.

### 2. నిరక్షరాస్యత

UN Population Fund నివేదిక ప్రకారం చదువు లేని బాలికల్లో 48 శాతం మంది ఉన్నారు. అందులో 18 సంవత్సరాల వయసు నిండకముందే వివాహం చేస్తున్నారు.. అయితే ఉన్నత విద్య పొందిన వారిలో కేవలం 4 శాతం మాత్రమే బాలికలు ఉన్నారు.

### 3. లింగ అసమానత

పితృస్వామ్య వ్యవస్థలో బాలికలు.. బాలురు కంటే తక్కువ అని, కుటుంబంలో వారి పాత్ర గృహిణులు అనే వాదం వల్ల బాల్యవివాహానికి ఇదొక కారణమైంది. నేడు అది ఎంతగానో తగ్గింది, కానీ అక్షరాస్యత లేని కుటుంబాలు గ్రామీణ స్థాయిలో ఎక్కువ ఉండటంలో ఆ ప్రాంతాల్లో అక్కడక్కడా బాల్య వివాహాలు జరుగుతున్నాయి. అది కూడా రూపుమాపాలి, బాలికా విద్యను పెంపొందించాలి. ఇంట్లో ఒక బాలిక చదువుకుంటే ఆ కుటుంబానికే కాదు ఎంతో మందికి వెలుగునిస్తుంది..

## బాల్యవివాహాలపై కఠినమైన చట్టాలు

స్వాతంత్ర్యానికి ముందే బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయడానికి చట్టాలు చేశారు. 1929లో రూపొందించిన సర్దా చట్టం ప్రకారం ఆడవారికి వివాహ వయస్సు 14 సంవత్సరం గానూ, మగవారికి వివాహ వయస్సు 18 సంవత్సరాలుగా నిర్ణయించింది. తరువాత, 2006లో బాల్య వివాహ నిరోధ చట్టం వివాహ వయస్సును ఆడవారికి 18 గానూ, మగవారికి 21 గానూ నిర్ణయించింది. ఈ చట్టం ప్రకారం బాల్య వివాహాలను నిషేధించడానికి, చట్టరీత్యా చర్యలు తీసుకునే అధికారులను ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలే నియమిస్తున్నాయి.

బాల్య వివాహాలు అరికట్టడానికి, నిషేధించడానికి మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ విధివిధానాలు, పథకాలు ఎప్పటికప్పుడు రూపొందిస్తూనే ఉన్నాయి. జాతీయ మహిళా కమీషన్, జాతీయ బాలల హక్కుల సంరక్షణ కమీషన్ ( NCPR ) బాల్యవివాహాలు నిరోధించడానికి పనిచేస్తున్నాయి. బాల్య వివాహాలను నిషేధించడానికి 1098 హెల్ప్ లైన్ నంబరు కూడా అందరికీ అందుబాటులో ఉంది.

## కేంద్రం, రాష్ట్ర పథకాలు

కేంద్రం ప్రవేశపెట్టిన బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమం అన్ని రాష్ట్రాల్లో అమలవుతోంది. ఈ పథకం ద్వారా బాలికల్లో విద్యను పెంపొందించి, బాల్యవివాహాలను రూపుమాపటంలో ప్రధాన భూమిక పోషిస్తోంది. దేశవ్యాప్తంగా కళ్యాణమస్తు, షాదీ తోఫా వంటి పథకాల ద్వారా 18 సంవత్సరాలు దాటిన ఆడవారి పెళ్లికి ఆర్థిక సహాయం అందజేస్తుంది.

## బాల్య వివాహాలతో నష్టాలు

*బాల్యవివాహాల వల్ల తల్లి, బిడ్డల మరణాలు పెరుగుతాయి*

*బాల్యం లోనే పెళ్లి చేస్తే శారీరక సమస్యలు వస్తాయి.*

*తల్లుల్లో రక్తహీనత,పోషకాహార లోపం కలుగుతాయి..*

*చదువు లేకపోవడంతో అవగాహన లోపిస్తుంది*

*ఉపాధి ఉండకపోతే ఆర్థిక అవకాశాలు ఉండవు, చివరకి వంట గదికే పరిమితమైపోతారు.*

*దానికి తోడు, గృహహింస, మానసిక సమస్యలకు లోనవుతారు..*

ఇలాంటి సమస్యలు రాకూడదు అంటే, లింగ సమానత్వంతో ప్రవర్తించి, అందరూ సమానమే అని భావించి బాలికా విద్యను ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. చట్టాలను బలోపేతం చేసి సమాజంలో అందరి సహకారంతో బాల్య వివాహాలు అరికట్టాల్సిన అత్యవసరం ఉంది.

బాల్యవివాహాలను అరికట్టడం ద్వారా ఐక్యరాజ్యసమితి SDG 5.3 చేరుకోవడంతో పాటు వికసిత్ భారతావనికి చేరుకోవడానికి ఇది సహకరిస్తుంది...

## 'బాల్య వివాహ రహిత భారత్' లక్ష్యంగా కేంద్రం సమరశంఖం!

నేటి బాలలే రేపటి పౌరులు. కానీ, ఆ బాల్యం అజ్ఞానపు, ఆచారాల కోరల్లో చిక్కుకుని చితికిపోతుంటే చూస్తూ ఊరుకోలేం. అందుకే, కేంద్ర ప్రభుత్వం ఒక బృహత్తర సంకల్పంతో ముందుకు వచ్చింది. నవంబర్ 27న మొదలై, మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం వరకు కొనసాగే ఈ 'నేషనల్ క్యాంపెయిన్' కేవలం ఒక కార్యక్రమం కాదు.. బాల్యవివాహాలను అరికట్టే ఒక సామాజిక చైతన్య ఉద్యమం.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (NFHS) గణాంకాల ఆధారంగా, జాతీయ సగటు కంటే ఎక్కువ బాల్య వివాహాలు జరుగుతున్న 257 జిల్లాలపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి మార్పు తీసుకురావాలని ఈ కార్యక్రమం మొదలుపెట్టింది.

## దశల వారీగా ఈ కార్యక్రమం మూడు దశల్లో సాగుతోంది:

1. మొదటి దశ (నవంబర్ 27 – డిసెంబర్ 26): బాల్య వివాహాలపై అవగాహనా సదస్సులు.

2. రెండవ దశ (జనవరి): ప్రత్యేక కార్యక్రమాలు, సేవా ప్రదాతల నిబద్ధత.


3. మూడవ దశ (ఫిబ్రవరి – మార్చి 8): సామూహిక ప్రతిజ్ఞలు, ముగింపు వేడుకలు.

## అందరి భాగస్వామ్యంతోనే ఫలితాలు

బాల్యవివాహాలు అరికట్టడానికి కేంద్రం చేస్తున్న ఈ కార్యక్రమంలో పోలీసు, న్యాయ వ్యవస్థ పాత్ర అత్యంత కీలకం. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్టేట్, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీస్ (SLSA & DLSA) బాల్య వివాహాల నిషేధ ప్రచారాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పారా-లీగల్ వాలంటీర్లు, జిల్లా స్థాయి ఆశా (ASHA) కమిటీలు నిరంతరం బాల్య వివాహాలు జరగకుండా నిఘా పెడుతున్నాయి.

ఆరోగ్య కార్యకర్తలు (ANM), ఆశా వర్కర్లతో పాటు, ప్రైమరీ హెల్త్ సెంటర్ల (PHC) లోని మెడికల్ ఆఫీసర్లు, శిశు ఆరోగ్య అధికారులు (RCH) ఈ ప్రచారంలో భాగస్వామ్యం అవుతున్నాయి. బాల్య వివాహాల వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, అనర్థాలను వివరిస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్నారు.

బాల్య వివాహం జరుగుతుందంటే ఇరు కుటుంబాలతో పాటు అందుకు సహకరిస్తున్న వ్యవస్థలూ కారణమే. అందుకే కేంద్రం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం.. పెళ్లి జరిపే వారు, బ్యాండ్ పార్టీలు, డెకరేటర్లు, ఫంక్షన్ హాల్ యజమానులు, కేటరింగ్ వాళ్ల నుంచి ప్రభుత్వం లిఖితపూర్వక హామీలను తీసుకుంటోంది. ఈ హామీ పత్రంలో తాము ఏ పరిస్థితుల్లోనూ బాల్య వివాహాలకు సహకరించబోమని వారు సంతకాలు చేయాల్సి ఉంటుంది.



## మత గ్రంథాల సాక్షిగా.. నైతిక బోధన!

మత గురువులు కేవలం ఉపన్యాసాలకే పరిమితం కాకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. తమ మత గ్రంథాల్లో ఉన్న బాల్య సంరక్షణ, మహిళా గౌరవానికి సంబంధించిన సూక్తులను కోట్ చేస్తూ ప్రసంగాలు చేయాలని సూచించింది. గ్రామీణ స్థాయిలో ఉన్న పంచాయతీల నుండి, పట్టణ ప్రాంతాల్లో వార్డ్ కౌన్సిలర్ల వరకు ఈ ప్రచారానికి సారథ్యం వహిస్తారు. మీడియా సంస్థలు, సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్స్ (CSOs) కేవలం వార్తలను ప్రసారం చేయడమే కాకుండా, ప్రతిజ్ఞా కార్యక్రమాలను స్వయంగా నిర్వహించే స్టేక్ హోల్డర్లుగా మారాయి. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేక చెక్ లిస్టులు, రిపోర్టింగ్ ఫార్మాట్లు, లోగోతో కూడిన వస్తువులను పంపిణీ చేస్తోంది.

## మార్పు మన ఇంటి నుంచే..

ప్రభుత్వం నిధులు ఇచ్చింది, చట్టాలను పటిష్టం చేసింది, వ్యవస్థలను సమన్వయం చేసింది. కానీ, నిజమైన మార్పు ఎప్పుడు వస్తుంది? ఏ రోజైతే ఈవెంట్ ఆర్గనైజర్ తన వద్దకు వచ్చిన పెళ్లి ఆర్డర్ లో వధువు వయస్సు తక్కువ అని తెలిసి 'నేను చేయను' అని తిరస్కరిస్తాడో.. ఏ రోజైతే పక్క ఇంట్లో బాల్య వివాహం జరుగుతుంటే ఫిర్యాదు చేసి ఆపుతాడో,. అప్పుడే 'బాల్య వివాహ రహిత భారత్' సాధ్యమవుతుంది.

బాల్యంలో చదువుకుని ఎదగాలి కానీ, పెళ్లిచేసుకుని వంటగదిలోనో మగ్గిపోకూడదు. మార్చి 8వ తేదీన మనం జరుపుకోబోయే మహిళా దినోత్సవం నాటికి, మన దేశంలోని ప్రతి బాలిక స్వేచ్ఛగా బడికి వెళ్లే వాతావరణాన్ని కల్పిద్దాం. బాల్యాన్ని కాపాడుకుందాం.. భారత భవిష్యత్తును నిర్మిద్దాం!

*– **వావిలపల్లి భార్గవ,** ఐఆర్ఎంఎస్ (ట్రైనీ)*
*8688162615*

# ముచ్చటైన "ముస్తాబు"

* బడి పిల్లల ఆరోగ్యంపై 'మన్యం' సరికొత్త సంతకం!
* ముస్తాబుతో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు అలవడతాయి
* తాళ్లపాలెం సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో రాష్ట్రవ్యాప్త 'ముస్తాబు' ప్రారంభ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

"శుభ్రతే ఆరోగ్యం – ఆరోగ్యమే ఆయుష్షు" అనే నినాదంతో పార్వతీపురం మన్యం జిల్లా పాఠశాలల్లో ఓ శుభ్రతా ఉద్యమం మొదలైంది. గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థుల జీవనశైలిని మార్చేందుకు, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి రూపకల్పన చేసిన అద్భుతమైన కార్యక్రమమే ఈ "ముస్తాబు".

పాఠశాలలు కేవలం చదువుకే పరిమితం కాకుండా, క్రమశిక్షణ, ఆరోగ్య పరిరక్షణకు కేంద్రాలుగా మారాలనే సీఎం గారి ఆశయాలకు అనుగుణంగా పార్వతీపురం మన్యం జిల్లాలో కలెక్టర్ ప్రయోగాత్మకంగా "ముస్తాబు" కార్యక్రమాన్ని నిర్వహిస్తే... ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు స్వయంగా అభినందిస్తూ, దీనిని రాష్ట్రవ్యాప్తంగా ఒక ఉద్యమంగా తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

ఈ నేపథ్యంలో అనకాపల్లి జిల్లా తాళ్లపాలెం సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2025 డిసెంబరు 20న సందర్శించి, ఈ స్కూల్ నుంచే ముస్తాబు కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించారు. విద్యార్థినులతో కాసేపు మాట్లాడి వ్యక్తిగత శుభ్రత పాటించే విధానాలను పరిశీలించారు.

### ఈ కార్యక్రమ ముచ్చట్లు ఇవీ...

చిన్న చిన్న ఆలోచనలు ఒక్కో సందర్భంలో అభివృద్ధికి బాటలు వేస్తాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ముస్తాబు కార్యక్రమం ద్వారా విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించే విధానాలను స్వయంగా సీఎం పరిశీలించారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఆలోచనతో రూపుదిద్దుకున్న ఈ కార్యక్రమాన్ని తాళ్లపాలెం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేలా ప్రారంభిస్తున్నానని ముఖ్యమంత్రి తెలిపారు. రెసిడెన్షియల్ పాఠశాలలోని విద్యార్థినులతో ముఖ్యమంత్రి కొద్దిసేపు మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో 75 లక్షల మంది విద్యార్థులు ఇంటర్ వరకూ చదువుతున్నారని, ముస్తాబు లాంటి కార్యక్రమం వల్ల వ్యక్తిగత శుభ్రతతో పాటు నాయకత్వ లక్షణాలు అలవడతాయని సీఎం పేర్కొన్నారు. చక్కగా తలదువ్వుకోవటం, భోజనానికి ముందు శుభ్రంగా చేతులు కడుక్కోవటం వల్ల అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ విద్యాశాఖలో వినూత్నమైన సంస్కరణలు తీసుకువస్తున్నారని కొనియాడారు. వివిధ శాఖల మంత్రులు కూడా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకే కృషి చేస్తున్నారన్నారు.





## ముస్తాబు లక్ష్యాలు

* విద్యార్థులకు ప్రతి రోజూ వ్యక్తిగత పరిశుభ్రతను అలవాటుగా మార్చడం

* క్రమం తప్పకుండా పిల్లలు పాఠశాలకు వచ్చేలా చూడడం

* క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాల పెంపు

* పాఠశాలలు, వసతిగృహాల్లో పిల్లలకు సురక్షితమైన పరిశుభ్ర వాతావరణం కల్పించడం

## పిల్లలు రోజూ ఏం చేయాలి?

* శుభ్రమైన యూనిఫాం, చెప్పులు వేసుకుని రావాలి

* గోళ్లు కత్తిరించి, తల దువ్వుకుని రావాలి

* చెవులు, ముఖం శుభ్రంగా ఉంచుకోవాలి

* మరుగుదొడ్లకు వెళ్లి వచ్చాక, భోజనానికి ముందు తప్పనిసరిగా సబ్బుతో చేతులు కడుక్కోవాలి

* పరిశుభ్రమైన, సురక్షితమైన నీళ్లే తాగాలి.

* కౌమారదశ బాలికలకు రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

## ముస్తాబు కార్నర్ ఏర్పాటు

* పాఠశాలలో ప్రతి తరగతి గది, హాస్టల్‌లో ఒక ముస్తాబు కార్నర్ ఏర్పాటుచేస్తారు. ఇక్కడ అద్దం, దువ్వెన, తువ్వాలు, సబ్బు, నెయిల్ కట్టర్, హ్యాండ్ వాష్, నీళ్లతో బకెట్ ఉంచుతారు.

* విద్యార్థులలో ఒకరిని పరిశుభ్రత నాయకులుగా నియమిస్తారు. ముస్తాబు కార్యక్రమాన్ని వీరే పర్యవేక్షిస్తారు.

* చేతులు కడుక్కునే విధానం, గోళ్లు, జుట్టు, వ్యక్తిగత శుభ్రత, మరుగుదొడ్డి వినియోగంపై పిల్లలకు అర్థమయ్యేలా పోస్టర్లు అక్కడే ప్రదర్శిస్తారు.

* సాధ్యమైనచోట అద్దం, సబ్బు, హ్యాండ్ వాష్ చేసుకునే స్థలం సూచించే బోర్డులు ఏర్పాటు చేస్తారు.

* వారపు పరిశుభ్రత చెక్ లిస్ట్, ముస్తాబు స్టార్ పేర్లను ప్రదర్శిస్తారు





## పిల్లలకు ప్రోత్సాహకాలు

వారపు ముస్తాబు స్టార్

నెలవారీ పరిశుభ్రమైన తరగతి / హాస్టల్

జిల్లాస్థాయి ఉత్తమ పాఠశాల, వసతిగృహం అవార్డులు

"ముస్తాబు కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి. క్లాస్ లీడర్లు తమ తోటి విద్యార్థుల శుభ్రతను గమనిస్తూ, అందరూ క్రమశిక్షణగా ఉండేలా చూస్తారు. ఏ ఒక్క విద్యార్థి కూడా అపరిశుభ్రత వల్ల అనారోగ్యం బారిన పడకూడదన్నదే మా లక్ష్యం."

– నారా లోకేష్, విద్యాశాఖామాత్యులు

"చదువు ఎంత ముఖ్యమో, వ్యక్తిగత ముస్తాబు కూడా అంతే ముఖ్యం. పరిశుభ్రమైన వాతావరణం మానసిక ప్రశాంతతను, ఏకాగ్రతను ఇస్తుంది. సాధారణ పాఠశాల నుంచి వచ్చిన నేను ఈరోజు మంత్రిని అయ్యాను. మీరు కూడా మీ నేపథ్యాన్ని చూసి తక్కువగా భావించకుండా, ఐఐటీ వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో సీట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకోవాలి."

– ఎస్. సవిత (బీసీ సంక్షేమ శాఖ మంత్రి),

మోపిదేవిలోని గురుకుల పాఠశాలలో ముస్తాబు కార్యక్రమం ప్రారంభ సభలో..

* "శుభ్రత విద్యార్థులలో క్రమంగా ఆత్మ స్థైర్యాన్ని పెంపొందిస్తుంది. ఇది విద్యార్థులలో ఆత్మగౌరవాన్ని (Self-respect) పెంచుతుంది."

– మండలి బుద్ధ ప్రసాద్ (అవనిగడ్డ ఎమ్మెల్యే)

* "ముస్తాబు కార్యక్రమం గిరిజన ప్రాంత విద్యార్థుల్లో క్రమశిక్షణ, బాధ్యతను పెంచుతుంది. ఇది ఒక సామాజిక మార్పుకు నాంది."

– గుమ్మడి సంధ్యా రాణి,
గిరిజన, స్త్రీ & శిశు సంక్షేమ శాఖ మంత్రి.

* "చిన్న వయసులోనే శుభ్రత పట్ల అవగాహన కల్పిస్తే వారు బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారు. మన జిల్లాను దేశానికే ఆదర్శంగా నిలపడమే మా లక్ష్యం."

– డా. ఎన్. ప్రభాకర రెడ్డి, జిల్లా కలెక్టర్.

– **గణపతి రావు బెహరా,**
పీఆర్వో, సమగ్ర శిక్ష,
7732097027



# విద్యా విజయాలు

## ఇది రిసార్టు కాదు.. ప్రభుత్వ బడి

అదో మారుమూల గిరి పల్లెలోని బడి, శిథిలావస్థకు చేరింది. పిల్లల్ని పంపేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. పరిస్థితి అర్థం చేసుకున్న అక్కడి సింగిల్ టీచర్ విరాళాలతో దాన్ని బొమ్మరిల్లులా తీర్చిదిద్దారు. ఇప్పుడు శతశాతం హాజరుతో ఆ గిరుల్లో పిల్లలు సందడి చేస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలంలోని గోమంగి, కిముడుపల్లి పంచాయతీలకు కలిపి వన్నాడలోని గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల ఉంది. ఇందులో ఒకటి నుంచి 5 తరగతులు ఉన్నాయి. 32 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల శిథిల స్థితికి చేరడంతో ఉపాధ్యాయుడు నవీన్ కుమార్ చొరవ తీసుకున్నారు. తల్లిదండ్రులు, గ్రామస్థులకు అవగాహన కల్పించి విరాళాలు పోగుచేశారు. ఉపాధ్యాయులు, అధికారులు, ఎంఈవోలు, డీఈవో, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా వారూ సాయం చేశారు. సమకూరిన రూ.4 లక్షలతో పాఠశాలను బొమ్మరిల్లులా తీర్చిదిద్దారు. గోడలపై చిత్రాలను గీయించి వసతులన్నీ కల్పించారు. ఆటపాటలతో చదువు చెప్పడం మొదలు పెట్టడంతో పిల్లలు క్రమం తప్పకుండా రావడం మొదలుపెట్టారు. జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఈ పాఠశాలను చూసి ఎంతో ముచ్చటపడి సింగిల్ టీచర్ నవీన్ కుమార్ కృషిని అభినందించారు. ఇటీవల ఆ పాఠశాల వీడియోని నారా లోకేష్ తన సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకుని టీచర్ ని అభినందించారు.

## శభాష్.. మెగా పీటీఎం రోజున తల్లికి పునర్జన్మనిచ్చాడు

విద్యుత్ షాక్ తో కొట్టుమిట్టాడుతున్న తల్లి ప్రాణాలను సమయస్ఫూర్తితో కాపాడుకున్నాడో ఐదో తరగతి విద్యార్థి. ఈ ఘటన పశ్చిమ గోదావరి జిల్లాలోని జొన్నలగరువులో జరిగింది. మెగా PTM కు వస్తానన్న తల్లి ఎంతకీ రాకపోవడంతో కొడుకు దీక్షిత్ ఇంటికి వెళ్లగా తన తల్లి కరెంట్ షాక్ తో విలవిల్లాడుతూ కనిపించింది. దీక్షిత్ ఏమాత్రం భయపడకుండా, స్విచ్ ఆఫ్ చేసి, కరెంటు తీగను తీసేసి ఆస్పత్రికి తీసుకెళ్లాడు. వయస్సు చిన్నదే అవ్వచ్చు కానీ తన ఆలోచన మాత్రం చాలా గొప్పది.



## ప్రకాశించిన మాణిక్యాలు

ప్రతిభకు ప్రోత్సాహం తోడైతే... పరిమితులు ఎన్ని ఉన్నా అద్భుతాలు చేయవచ్చని చిత్తూరు జిల్లా కాంతిపురం మండలం రెడ్లపల్లె గ్రామానికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థినులు ఎం.యశస్విని, ఎస్.సింధు నిరూపించారు.. మహిళల భద్రత కోసం 'ఉమెన్స్ సేఫ్టీ డివైజ్ ఇన్ టూ వీలర్ బైక్స్' అనే పరికరాన్ని రూపొందించారు. ఈ పిల్లల ఆవిష్కరణ ఇటీవల జాతీయ స్థాయిలో ప్రత్యేక బహుమతి గెలుచుకున్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తూ, చున్నీలు, చీరలు వెనుక చక్రంలో చుట్టుకుపోవడం వల్ల మహిళలు ప్రమాదాలకు గురవుతున్న ఘటనల గురించి తరచూ వింటూనే ఉంటాం. ఈ ప్రమాదాలు కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోవడానికి దారి తీస్తాయి. ఇలాంటి యాక్సిడెంట్స్ నుంచి మహిళలకు భద్రత కల్పించే పరికరాన్ని 'ఉమెన్స్ సేఫ్టీ డివైజ్ ఇన్ టూ వీలర్ బైక్స్' తయారుచేసింది. యశస్విని, సింధుల ప్రతిభను గుర్తించిన రెడ్లపల్లె జెడ్పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం.టి.శ్రీనివాస్ 'గీతా యంగ్ సైంటిస్ట్ ఆవిష్కార్ అవార్డ్స్'(జివైఎస్ అవి ష్కార్) కి అప్లై చేయించి 'ఉమెన్స్ సేఫ్టీ డివైజ్ ఇన్ టూ వీలర్ బైక్స్ ప్రాజెక్టును తన పర్యవేక్షణలో చేయించారు. జీవైఎస్ ఆవిష్కార్ అవార్డుల పోటీలో 26 రాష్ట్రాలకు చెందిన 1,000కి పైగా ఆవిష్కరణలను ప్రదర్శించగా, అందులో ఎంపికైన 25లో యశస్విని, సింధుల ఆవిష్కరణకు ప్రత్యేక బహుమతి లభించింది.





### ఎలా పని చేస్తుందంటే...

ఉమెన్స్ సేఫ్టీ డివైజ్ ఇన్ టూ వీలర్ సెన్సర్ ఆధారంగా పని చేస్తుంది. ఈ పరికరాన్ని ద్విచక్ర వాహనం సీటుకింద.. ఎడమ భాగంలో అమర్చుకోవాలి. అది వాహనం హ్యాండిల్ కు ఏర్పాటు చేసిన బల్బుకు అనుసంధానమై ఉంటుంది. చున్నీ లేదా చీరకొంగు వాహనం చక్రంలో ఇరుక్కోగానే. ఆ పరికరం నుంచి సైరన్ మోత వినిపిస్తుంది. అలాగే హ్యాండిల్ కు అమర్చిన బల్బు వెలుగుతుంది. ఆ సంకేతాలను గమనించగానే.. వాహనాన్ని నడుపుతున్న.. దానిపై ప్రయాణిస్తున్న మహిళలు అప్రమత్తమై, వాహనాన్ని ఆపి, ప్రమాదం నుంచి బయటపడవచ్చు.

## మా బడి ప్రత్యేకతలు ఇవి

ప్రభుత్వ బడి ఉనికిని కాపాడేందుకు.. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు రేగడి ప్రాంతం లో ఉన్న ఉంగరాడ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. 'మా బడి ప్రత్యేకతలు ఇవీ' అంటూ ఫ్లెక్సీ పెట్టి గర్వంగా ప్రచారం చేస్తున్నారు. చుట్టు పక్కల గ్రామాల్లో పర్యటించి తల్లిదండ్రులకు భరోసా కల్పించారు. మీ పిల్లల బాధ్యత మాది అని హామీ ఇచ్చారు. వారి సాధకబాధకాలు తెలుసుకుని అండగా నిలిచారు. 2025 జూన్ నాటికి పాఠశాలలో 1 నుంచి 8 తరగతుల్లో కేవలం 63 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఈ సంఖ్య 100 దాటించాలని ఉపాధ్యాయులు భావించి సమీప గ్రామాల్లో పర్యటించారు. కొంత మంది విద్యార్థుల తల్లిదండ్రులు రాకపోకల్లో కలిగే ఇబ్బందులను చెప్పారు.




ఈ విషయం తెలుసుకున్న ప్రధానోపాధ్యాయుడు జి. రాంబాబు. గుళ్ల పాడు, లచ్చరాయపురం గ్రామాల నుంచి వచ్చే ఆరుగురు విద్యార్థులకు రూ.36 వేలతో సైకిళ్లు అందజేశారు. యాతపేట కేఎం వలస, వండానపేట నుంచి వచ్చే విద్యార్థులకు ఉచితంగా ఆటో ఏర్పాటు చేయించారు.. నేడు విద్యార్థుల సంఖ్య 102కు చేరుకుంది.

### విద్యార్థుల సంఖ్య పెంచాలనే లక్ష్యం

గ్రామస్థుల సహకారంతో విద్యార్థుల సంఖ్యను పెంచగలిగామని ప్రధానోపాధ్యాయుడు రాంబాబు మనబడి తో పంచుకున్నారు. గ్రామస్థులు తమ మీద నమ్మకంతో పిల్లలను కాన్వెంటు మాన్పించి, మరీ తమ పాఠశాలకు పంపిస్తున్నారని అన్నారు.

*సేకరణ:* **అమలాపురపు దుర్గా ప్రసాద్,** జర్నలిస్టు

## నమస్కారం..! పాఠశాల వార్తల ముఖ్యాంశాలు

ఈ తరగతి గదిలోకి అడుగుపెట్టగానే ఎటుచూసినా కెమెరాలు, లైట్లు, మైక్, సౌండ్ సిస్టం కనిపిస్తాయి. విద్యార్థులు యాంకర్లుగా, కెమెరామెన్లుగా, ఉపాధ్యాయులు ఎడిటింగ్ చేస్తూ బిజీగా కనిపిస్తారు. చూసిన వారు పొరపాటున ఏదైనా న్యూస్ రూమ్, ప్రొడక్షన్ కంట్రోల్ రూమ్ కి వచ్చారేమో అనుకుంటారు, కాని అది నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని వినూత్న కార్యక్రమం.. ఈ పాఠశాలలో ఇటీవల ఓ యూట్యూబ్ స్టూడియోను ప్రారంభించారు. అదేంటో తెలుసుకుందాం..

స్టార్ట్... కెమెరా.. యాక్షన్ సృజనాత్మక ఆలోచనలకు వేదికగా నిలుస్తోంది ఈ యూట్యూబ్ స్టూడియో..! పాఠశాలలో జరిగే ప్రత్యేక కార్యక్రమాలు, స్వచ్ఛత, మొక్కలు నాటే కార్యక్రమాలు. జాతీయ పర్వదినాల విశిష్టత. విద్యార్థుల పాఠ్యాంశాల్లో ముఖ్యాంశాలు, పరీక్షలకు సంసిద్ధత, వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్య, ఆహారపు అలవాట్లపై పలు సూచనలు, ఇవ్వడానికి యూట్యూబ్ స్టుడియోను ప్రారంభించారు.

**రోజూ సందడే !**

ఉదయాన్నే విద్యార్థులు పాఠశాలకు రాగానే ఉత్సాహంతో స్టూడియోకు వెళ్లి తమకు నచ్చిన అంశంపై రోజూ చర్చలు, ఇంటర్వ్యూలు, ఉపాధ్యాయులతో మాటామంతీ నిర్వహిస్తుంటారు. పాఠశాల వాట్సప్ గ్రూపుల్లో అప్లోడ్ చేస్తే 1700 మంది విద్యార్థులు, సుమారు 80 మంది ఉపాధ్యాయుల చరవాణికి వీడియోలు చేరుకుంటాయి. హైస్కూలు హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్, ఉపాధ్యాయులు శివ రాజ్ కుమార్ లు ప్రత్యేక శ్రద్ధతో ఈ యూట్యూబ్ ఛానెల్ ను రూపకల్పన చేశారు. వార్తలు చదవడం, కెమెరా ఆపరేటింగ్, ఎడిటింగ్, యాంకరింగ్ వంటి రంగాల్లో విద్యార్థులు రాణించేందుకు కూడా ఈ న్యూస్ రూమ్ స్టూడియో ఉపయోగపడుతుంది. ఈ స్టూడియోను ప్రారంభించటానికి అతిథిగా వచ్చిన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఎంతో ముచ్చటపడ్డారు.






– **ఇ. మానస,** *8వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శ్రీరంగరాజుపల్లి*




**రామ్ చరణ్,** *10వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మరడాం*

## బొమ్మ గీశానోచ్!




– **షేక్ మస్తాన్ బి,** *8వ తరగతి, వినుకొండ, పల్నాడు జిల్లా*



– **సి. నిర్మల,** *9వ తరగతి, AP మోడల్ స్కూల్, కోటకందుకూరు(V), ఆళ్లగడ్డ(M), నంద్యాల జిల్లా*

## చుక్కలు కలపండి



## రంగులు వేయండి



# కొలను–కోడిపిల్ల (కవిత)

అనగనగనగా ఒక కొలను, అందమైనది ఆ
కొలను కొలను చుట్టును కనుల విందుగా
పూచెను మెండుగ పుష్పములు శాఖలు,
కొమ్మలు నేలను తాకగ వంగెను 'విల్లో' చెట్లన్నీ
అక్కడనున్ననీటి మొక్కలను ఆరగించగా
అరుదెంచినదొక బాతుల గుంపు.

తరచు తరచుగా ఏకాంతమ్మున
కొలువు దీరునాబాతుల గుంపు
తమ విషయములను చర్చింపన్నా
టి భాషణము వినగను నేను ఉండినాను ఒక చెవి
యొగ్గి నా కవితా శక్తికందనిదా భాషణము.

కొలను ప్రక్కనే కాపురముండెను
కని–కల్ల లెరుగని  ఒక కోడి పిల్ల
వచ్చెడి పోయెడి బాతుల జూచి
తన రెక్కలను టప టప కొట్టి
చిన్ని తోకను పైకెగబట్టి
సిద్ధమయ్యెను జలక మాడగను
కొలనులోన ఆ కోడి పిల్ల.

బాతుల వోలె కాళ్ళు, రెక్కలు
తనకూ కలవని యోచించి
తన ముక్కును జూచి ముదమొందెన్వ
లదని తల్లి వారించినను
పలికెను ఇట్లు ఆ కూన .......

"ఈదుట యనగా నాకెరుక లేదా?
ఆ బాతులకన్నా తీసితినా?
అదృష్టమ్మును పరీక్షింతును
ధైర్యముగా నే పోయివత్తును!"
తల్లి మాటను పెడచెవి బెట్టి
దూకెను కూన కొలను గర్భమున.

ఈదుట రాని చిన్నారి
పొందెను ఎంతో కష్టమును
తల్లి మాటలు గుర్తుకు వచ్చెను
నేలను జేరను ప్రయత్నించెను;
విలవిల లాడెను దాని ప్రాణములు
వీడెను ఆశను తన పైన
అన్ని యత్నములు విఫలము కాగా
మునిగెను కూన నీటి మడుగున.
నీటిపైదేలు కూన శరీరము
బాతులకపుడు కనిపించన్
కలవరపడెను, కన్నీరిడెను
కోడి మరణమును వీక్షించి
తల్లి మాటను పెడచెవి బెట్టిన
ఫలితమెఅది అని అవి ఎంచెన్.

రచన : జొన్నలగడ్డ నాగేశ్వర రావు,
స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్),
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
దొడ్డిపట్ల. కైకలూరు మండలం, ఏలూరు జిల్లా.
9550188193





# మకుటం లేని మహారాజు

జూలకల్ ఒక ఊరు. ఆ ఊరిలో రాజు అనే ఒక పిల్లవాడు ఉన్నాడు. తన వయసు పది సంవత్సరాలు. వాళ్ళ తల్లిదండ్రులు పని చేయలేరు. అందుకని ఆ భారాన్ని తన భుజాల వేసుకున్నాడు. వాళ్ళకి పొలం లేదు . అంత చిన్న వయసులోనే తాను ఆ భారాన్ని తన భుజాల మీద వేసుకొని తన రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడి పనిచేసేవాడు. తనకు 25 వెళ్ళు రాగానే 40 ఎకరాల పొలం కొన్నాడు. ఒక పెద్ద ఇల్లు. 6 ఎద్దులు, 10 ఆవులు, 12 గేదేలు, 40 గొర్రెలు సంపాదించాడు. ఊళ్ళో వాళ్ళు రాజుని చూసి ఆశ్చర్యపడ్డారు.

గౌరవం, మర్యాద, పేరు, ప్రతిష్టలు సంపాదించు కున్నాడు. అప్పటి నుండి తనని అందరూ "రాజన్న" అని పిలిచేవారు. తీర్పులు చెప్పేవాడు, అతన్ని నమ్మి వచ్చిన వారికి కాదనకుండా సహాయం చేసేవాడు. ఎవరికైన డబ్బు అవసరం అయితే కాదనకుండా ఇచ్చేసేవాడు. మాట ఇస్తే తప్పడు. రాజన్నకు పెళ్లి అయ్యింది.

తన భార్య వాళ్లకు ఒకతే కూతురు. వాళ్ళ "కూతురు పేరు మీద ఉన్న పొలం రాసిస్తాం అన్నా తీసుకోలేదు. ఒకరి ఆస్తి నాకు అక్కర్లేదు "అన్నాడు.

రాజన్నకు నలుగురు కొడుకులు. తాను పడ్డ కష్టం తన కొడుకులు పడకూడదని బాగా చూసు కున్నాడు. మళ్ళా 20 ఎకరాల పొలం కొన్నాడు. తన కొడుకులను చదివించాలనుకున్నాడు. పెద్దవాడు, రెండేవాడు కొంతవరకు చదువు కున్నారు. మూడేవాడు చదువు కోలేదు. నాలుగవ వాడు Police job తెచ్చుకున్నాడు. నలుగురికి పెళ్ళిల్లు చేసాడు. తన కోడళ్ళకు కూడా కట్నం తీసుకోలేదు. కోడళ్ళను కూతుళ్ళులా చూసుకున్నాడు.

తన ఇంటికి ఎవరైన వస్తే తానే అన్నం వండించి మరీ పెట్టేవాడు. అంతటి ధర్మధాత. ఇంటి బాధ్యతలు పెద్దకొడుకుకి అప్పగించాడు. రాజన్న లాగే పెద్దకొడుకు కూడా దానాలు, ధర్మాలు చేసేవాడు. పదిమందికి అన్నం పెట్ట ఆదుకునేవాడు. తమ్ముల్లు కూడా అన్న మాట జవదాటేవారుకాదు. వాళ్ళని చూసి కొంతమంది ఓర్వలేకపోయారు. ఎలాగయిన వాళ్ళని విడగొట్ట ఆస్తి అంతస్తులను నాశనం చేయాలనుకున్నారు. పెద్దవాడికి స్నేహితులు పక్కన చేరి తన డబ్బుతోనే తిని అతన్ని తాగుడుకి అలవాటు చేసారు. అతడితో అప్పులు చేయించారు. తనకు గుర్తులేనప్పుడు మళ్ళా ఆ డబ్బును వాళ్ళే కొట్టేసేవారు. మూడో కొడుకు తన అన్నని గమనించి రాజన్నతో చెప్పాడు. నాన్న నిలదీస్తే అప్పుల విషయం బయటపడింది . " ఆ డబ్బు అంత ఏం చేసావు " అన్నాడు. ఏమీ చెప్పలేకపోయాడు.

"అప్పుల విషయం మీకెందుకు నాన్న. ఆ బాధ్యత నాది అన్నాడు." రాజన్న చాలా బాధపడ్డాడు.

తాగుడుకి అలవాటుపడి పంటలు పట్టించు కోకుండా తిరిగేవాడు. పంటలు సరిగ్గపండ లేదు. దాంతో రాజన్న ఆస్తిపంపకాలు చేసాడు. తన ఇద్దరు తమ్ముళ్ళు ఎంత చెప్పినా వినకుండా తాగి తిరిగేవాడు పెద్దవాడు. దాంతో తమ్ముల్లు ఎదురు తిరిగారు. తమ్ముళ్ళతో గొడవపడి " నా ఆస్తి, నా అప్పు మీకెందుకు మధ్యలో" అని గొడవపడ్డాడు. తమ్ముళ్ళతో మాట్లాడటం మానేసాడు. పంటలు పండలేదు. చేతిలో డబ్బు లేవు. అప్పుల వాళ్ళ ఇంటికి వచ్చారు. నానా మాటలు అన్నారు.

"అది చూసి రాజన్న ఒకరితో మాటపడకుండా బ్రతికి ఇప్పుడు ఇలాంటి పరిస్థితి వచ్చింది" అని ఎంతో బాధపడ్డాడు.

పెద్ద కొడుకు పొలాన్ని అమ్మకానికి పెట్టాడు. 'అది చూసి నేను కష్టపడి సంపాదించిన ఆస్తి మొత్తం పోతుంది' అని బాధపడ్డాడు. ఆ బాధలో గుండెనొప్పి వచ్చి చనిపోయాడు రాజు. కొడుకులు, కోడళ్ళు, తన భార్య గుండెలు పగిలేలా ఏడ్చారు.


పెద్దవాడు తన భాగం మొత్తం అమ్మివేసాడు. అయిన అప్పు తీరలేదు. తన స్నేహితులు . కూడా అందరిలో చేరి అతన్నిపంచాయితికి తీసుకెళ్లారు. అక్కడ తనకు ఘోరమైన అవమానం జరిగింది. వాళ్లే తీర్పులు చేప్పేవారు. కాని ఇప్పుడు వాళ్ళకే అలాంటి పరిస్థితి వచ్చింది.

తన ముగ్గురు తమ్ముల్లు వాళ్ల భాగాన్ని అమ్మివేసి అన్నకు ఆ డబ్బు ఇచ్చారు. అప్పులు కట్టేశాడు. "ఇన్ని రోజులు మోసగాళ్ళను స్నేహితులు అనుకుని మిమ్మల్ని దూరం చేసుకున్నాను" అని చాలా బాధపడ్డాడు, వాళ్ళ ఇంటిని అమ్మి వేసి అప్పులు కట్టేశాడు.. మొత్తం 60 ఎకరాల పొలం అమ్మివేశారు. రాజన్న బ్రతికి ఉన్నన్ని రోజులు ఆస్తి తనతోనే ఉంది. తను వెళ్లిపోగానే ఆస్తి కూడా వెళ్లిపోయింది. 40,50 మంది పనివాళ్ళ పనిచేయించుకునే వాళ్ళు. అలాంటిది ఇప్పుడు వాళ్లే ఒకరి దగ్గర పని చేయాల్సి వచ్చింది. వాళ్ళ ఊరును వదిలి వెళ్లిపోయారు. వారి బాధకు అంతం లేదు. చెడు స్నేహితులను నమ్మి వారితో స్నేహం చేస్తే చెడు అలవాట్లే వస్తాయి . దానితో జీవితం నాశనం అవుతుంది.

– **కె.యు.దేవి,** 10వ తరగతి
Z.P.H.S, పోలకల్ (గ్రామం),
సి. బెళగల్ (మం) ,కర్నూల్ (జిల్లా),
9491851349.







# గొప్పగుణం



ఒక పెద్ద మర్రిచెట్టుపై ఒక కాకి జంట, చిలుకజంట నివసించేవి. ఆ చిలుక జంటలో ఆడచిలుక పేరు పంచ వన్నెల.దానికి తాను మహా అందగత్తెననే గర్వంతో మిడిసిపడేది. రంగురంగుల రెక్కలతో అందంలో తనను మించినవారెవరు లేరని, తన పలుకులు ఎంత చూడ ముచ్చటగా ఉంటాయో అని తన గొప్పలు చెప్పడమే కాదు, ఆ చెట్టుపై నివసిస్తున్నఆ కాకిజంటలో ఆడకాకి "సుమనస్విని" చూసి " నల్లగా నువ్వెంత అందవికారం గా ఉంటావో, పైగా కావు,కావు అంటూ అరిచే నీ అరుపు ఎంత కర్ణకఠోరంగా ఉంటుందో" అని గేలి చేసేది. అయినప్పటికి పాపం సుమనస్విని పంచవన్నెల ఏమన్నా దానితో ఏ విధమైన గొడవ పెట్టుకోకుండా, ఒకే చెట్టుపై నివసిస్తున్న పక్షులం మనమంతా కలిసిమెలిసి జీవించాలి అనే భావంతో సంయమనం పాటిస్తూ మిన్నకుండేది.

అలా ఒకనాడు పంచవన్నెల తనని తాను చూసుకుంటూ మురిసిపోతూ ఏమరుపాటుగా ఉండటంతో ఒక వేటగాడు దానిపై వల పన్ని ఆ వలలో దానిని బంధించి తనతో పాటు తీసుకుపోతుండటంతో ఆ పంచవన్నెల చిలుక భయంతో తనను "రక్షించండి,రక్షించండి" అని వేడుకుంది. కానీ దాని మాటలు ఎవ్వరూ పట్టించుకోలేదు. పంచవన్నెల జంట మగ చిలుక కూడా ఏమీ చేయలేక నిస్సహాయంగా ఆ వేటగాడు వెనుకే వెళ్ళింది. ఆ వేటగాడు ఆ చిలుకని ఒకతనికి అమ్మేసాడు. అతను ఆ పంచవన్నెల చిలుకను పంజరంలో ఉంచి తన ఇంటి వీధి అరుగు పైన ఉన్న ఒక కొక్కానికి తగిలించి పెంచుకోసాగాడు. ఆ సమయంలో సుమనస్విని కూడా ఆహారం కోసం బయటకు వెళ్ళడంతో తనకి పంచవన్నెలని ఎత్తుకునిపోయినట్లు తెలిసింది కాదు. ఈ లోపు పంచవన్నెల జంటలో మగ చిలుక తిరిగి మర్రిచెట్టు చేరి తన భార్యపై బెంగతో ఏడుస్తూ కూర్చుంది. అలా ఎందుకేడుస్తుందో ఆరా తీసింది సుమనస్విని. జరిగినదంతా ఏడుస్తూ చెప్పింది మగచిలుక. దానికి సుమనస్విని " నువ్వేం దిగులుపెట్టుకోకు, నేనూ, నా భర్త కలిసి వెళ్ళి నీ భార్యను క్షేమంగా తీసుకొస్తాం, సరేకానీ నీ భార్య పంజరంలో బందీ అయిన చోటు చూపిద్దువూ గానీ ,మాతో రా" అని చెప్పింది. ఆ రాత్రికే ఆ కాకి జంట, మగ చిలుకతో కలిసి పంజరంలో బందీ అయిన పంచవన్నెల చిలుక ఉన్న చోటుకి వెళ్ళాయి. సుమనస్విని ఆ పంజరం పై వాలి పంచవన్నెలతో " నువ్వేం కంగారుపడకు, నిన్ను రక్షించడానికొచ్చాం,కాసేపు ఓపికపట్టు" అని ఓదార్చి సుమనస్విని దగ్గరలో గట్టిగా ఉన్న ఒక కర్రపుల్లని వెతికి నోట కరచుకుని తెచ్చి దాన్నిఒక పక్క తను నోట కరచుకుని జాగ్రత్తగా ఇంకో పక్కనుంచి పంజరానికి ఉన్న రింగులోకి దూర్చి ఆ పక్కను తన భర్త నోట కరచుకోమని చెప్పి జాగ్రత్తగా ఆ కొక్కెం నుంచి పంచవన్నెల చిలుకతో ఉన్న పంజరాన్ని తప్పించి కర్రకు రెండు వైపులా కాకిజంట నోట కరచుకుని ఎగురుకుంటూ మర్రిచెట్టు వద్దకు చేరుకున్నాయి. వెనుకే ఆనందంగా మగచిలుక అనుసరించింది. అదే చెట్టు తొర్రలో నివసిస్తున్న వడ్రంగిపిట్ట సాయాన్ని తీసుకుని ఆ పంజరానికున్న తాళాన్ని పగులగొట్టించింది. వెంటనే పంజరంనుంచి పంచవన్నెల స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకోవడమే కాకుండా " అందంగా ఉండటం, తళుకుబెళుకులు చూసి మురిసిపోవడం, చిలుకపలుకులు పలకడం అనేవి గొప్ప గుణాలు కాదు, ఇతరులకు సాయం చేయడం కు మించిన గొప్పగుణం ఈ లోకాన లేదని తెలుసుకుని, సుమనస్వినితో తనని క్షమించమని వేడుకుంది". అప్పటినుంచి ఆ కాకి జంట, చిలుక జంట ఎంతో స్నేహంగా ఉంటూ ఒకరికొకరు సాయపడుతూ హాయిగా జీవించసాగాయి.

**– కొమ్ముల వెంకట సూర్యనారాయణ,**
*సీనియర్ లెక్చరర్ డైట్, బొమ్మూరు,*
*రాజమహేంద్రవరం(రూరల్) మండలం*
*తూర్పుగోదావరి జిల్లా, 9949602721*

# ఏ ఆకారంలో ఎంత?

గొర్రెల పెంపకంలో సిద్ధహస్తుడు రామయ్య. అతని మందలో గొర్రెల సంఖ్య పెరగడంతో తనకొక సహాయకుడు కావాలనుకున్నాడు. ఈ విషయాన్ని గ్రామస్తులలో కొంత మంది యువకులకు తెలియజేశాడు.

ముగ్గురు యువకులు వచ్చి రామయ్యను కలిశారు.వారిని గొర్రెల ఆహారం గురించి అడిగాడు రామయ్య.' పచ్చిక బయలు ఉన్న చోట పచ్చగడ్డిని పోటీపడి తింటాయి' చెప్పారు ముగ్గురూ.

'అయితే ఆ పచ్చిక బయలులో పులి తిరిగితే అప్పుడేమి చేస్తారు?' అడిగాడు రామయ్య.

' కంచె వేసుకొని వాటికి ఆహారం మేపుతాం' ముక్తసరిగా చెప్పారు ముగ్గురూ.

'అయితే, నా దగ్గర 154 గొర్రెలున్నాయి. అవి ఒక్కొక్కటి ఒక చదరపు మీటరులో ఉన్న గడ్డి తింటేనే తృప్తిగా ఇంటిదారిపడతాయి. మీలో ఒక్కొక్కరికి 44 మీటర్ల పొడవు గల కంచె ఇచ్చాననుకొండి. ఏ ఆకారంలో అమర్చి వాటిని సంతృప్తి పరుస్తారు?' ఈసారి అడిగాడు రామయ్య.

'దీర్ఘ చతురస్రాకారంలో కంచెను ఏర్పాటు చేస్తాను' అన్నాడు మొదటివాడు.

'నేనైతే చతురస్రాకారంలో కంచెను అమరుస్తాను' చెప్పాడు రెండవ వాడు.

ఇప్పుడు బాగా ఆలోచించిన మూడో వాడు 'కంచెను వృత్తాకారంగా అమరుస్తాను' చెప్పాడు.

రామయ్య ముగ్గురి వైపు ఎగాదిగా చూశాడు.చివరకు మూడో వాడిని రేపటినుంచి పనిలోకి వచ్చేయ్ అన్నాడు.

మిగిలిన ఇద్దరూ రామయ్యను ఏ ప్రాతిపదికన మూడో వాడ్ని ఎన్నిక చేశారు అని నిలదీశారు.

మొదటి వాడివైపు చూసి 'నీ దీర్ఘ చతురస్రం కొలతలు 12,10 మీటర్లు అయితే 120 గొర్రెలు మాత్రమే సంతృప్తి చెందగలవు'. ఇప్పుడు రెండో వాడి వైపు చూసి '11మీటర్ల భుజంగల చతురస్రంగా అమరిస్తే 121 గొర్రెలు మాత్రమే సంతృప్తి చెందగలవు.. మరి మూడో వాడు వృత్తాకారంలో అమరిస్తే దాని వ్యాసార్థం 7 మీటర్లు అవుతుంది.అప్పుడు దాని వైశాల్యం సుమారు 154 చదరపు మీటర్లు అవుతుంది.అప్పుడు 154 గొర్రెలు సంతృప్తి చెందగలవు. అందుకే మూడో వాడిని పన్లో పెట్టుకుంటున్నాను' అనుమాన నివృత్తి చేశాడు రామయ్య.

**– బి.వి.పట్నాయక్,**
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
నర్సీపురం, పార్వతీపురం మన్యం జిల్లా.
8309872913








# చిరునవ్వుల చిన్నారులు




## Samagra Shiksha Official (AP)

Official entity of Department of School Education, Govt. of Andhra Pradesh

Scan the QR Code & Follow Samagra Shiksha

Samagra's Official **WhatsApp Channel**
Samagra's Official **YouTube Channel**
Samagra's Official **Instagram Page**
Samagra's Official **Facebook Page**
Samagra's Official **X (Twitter)**
Samagra's Official **LinkedIn Page**

One stop for official Announcements & Initiativesfrom Andhra's Education Department




Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
For mail: manabadimagazine@gmail.com, manabadimagazine@apschooledu.in,
Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed by : **M/s. Lakshmi Vignesh Printers,** Guntur